www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 2 సెప్టెంబర్ 2024

5

కాకినాడ

ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణ ప్రజలకు తాగునీరు అందిస్తున్న స్థానిక వాటర్ సప్లై ఫిల్టర్ బెడ్ నిర్వహణను కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆదివారం పరిశీలించారు. శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఫిల్టర్ బెడ్ నుంచి సరఫరా అవుతున్న నీరు ఆకుపచ్చ రంగులో రావడంపై తీవ్ర స్థాయిలో మండిపడిన ఉదంతం విదితమే. దీనిపై ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప సైతం అందుకు గల కారణాలు తెలుసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కమిషనర్ ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించారు. పసరు రంగులో నీరు రావడానికి గల కారణంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

నిరుపయోగం స్మార్ట్ సైకిల్ ట్రాక్

- పార్కింగ్ సౌకర్యం లేక అవస్థలు
- ట్రాఫిక్ సమస్యతో తప్పని ఇబ్బందులు
- రూ.4 కోట్ల ప్రజాధనం వృథా..!

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లా కేంద్రం కాకినాడలో సుమారు రూ.1000 కోట్ల స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ప్రతిష్టాత్మకంగా దాదాపు రూ.4 కోట్లు వెచ్చించి నిర్మించిన సైకిల్ ట్రాక్ నిరుపయోగంగా మారింది. ఈ తరుణంలో నగర వాసులు తీవ్రంగా ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటున్నారు. పార్కింగ్ సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వలన ట్రాక్ పూర్తిగా పనికి రాకుండా పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. 2021లో అప్పటి నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హయాంలో పిఠాపురం రోడ్డు మార్గంలోని జిల్లా ఎస్‌పి కార్యాలయం వద్ద గల మాధవ నగర్ పెట్రోల్ బంక్ కూడలి నుంచి నాగమల్లి తోట జంక్షన్ వద్ద అల్లూరి సీతారామ రాజు విగ్రహం వరకు అంత బాగున్న పాత రహదారిని పెకిలించి ఆధునిక టెక్నాలజీ పేరుతో సైకిల్ ట్రాక్ నిర్మించారు.

వివేకానంద పార్కు వద్ద సూర్యారావు పేట జవహర్ వీధిలోని ఉన్న క్యాంటీన్ జంక్షన్ మీదుగా నూకాలమ్మ గుడి జంక్షన్, రామారావుపేటలోని మూడు లైట్లు జంక్షన్ మలుపు వైపు, పిఆర్ కాలేజీ రోడ్డు వరకూ ఈ సైకిల్ ట్రాక్ నిర్మించారు. రోడ్డుపై మూడు అంగుళాల ఎత్తు సిమెంట్ పలకలు పెట్టి వాహనాల పార్కింగ్ లేకుండా నియంత్రించారు. పార్కును ఆనుకుని తూర్పు, ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్లాట్ ఫామ్ వృథా అయ్యింది. సైకిల్ ప్రయాణం చేసే వారు లేక నడిచే వారే సైకిల్ ట్రాక్ వాడడం వలన ప్లాట్ ఫారం వృథాగా మారింది. రద్దీ కలిగిన రహదారుల్లో రోడ్డు ఇరుకుగా చేయడం వలన వీధి వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

వివేకానంద పార్కుకు వచ్చే వాహనాలను బాలం వారి వీధి పార్కు ఎదురుగా ఉన్న రామారావుపేటలోని పశువుల ఆసుపత్రి వీధి, గోపాలకృష్ణ వీధుల్లో నివాస గృహాల ఎదురుగా వాహనాలను పార్కింగ్ చేయడం వలన స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. పిఠాపురం రోడ్డులో వాహనాల రద్దీ వలన రాత్రి వేళల్లో సైకిల్ ట్రాక్ పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఈ కారణంగా సైకిల్ ట్రాక్ గొట్టాలు పోయి ట్రాఫిక్ నడుస్తోంది. వివేకానంద పార్కు వద్ద పార్కింగ్ వెసులుబాటు ఇవ్వక పోవడం వలన వాహన దారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ సమస్యలు, జవహర్ వీధి పార్కు గేటు తెరవాలన్న డిమాండ్లపై నగర వాసులు అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్ల కాలంలో ముగ్గురు కమిషనర్లు, ముగ్గురు డిఎస్‌పిలు మారినా ట్రాఫిక్ వెతలు తీరడం లేదు. పార్కు వలన ప్రయోజనాలు నెరవేరడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ట్రాఫిక్ రద్దీ రహదారుల్లో సైకిల్ ట్రాక్ ఏర్పాటుపై ఆరంభంలోనే పౌర సంఘాలు వ్యతిరేకించాయి. ఇంజినీరింగ్ కాలేజీ నాలుగు వైపుల బీచ్ రోడ్డులో వన్ సైడ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే ఫలితం ఉంటుందని కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదు. ప్రజల అభిప్రాయాలు సూచనలు పట్టించుకోకుండా రూ.4 కోట్లు ప్రజాధనం వృథా చేశారనే విమర్శలు నగర వాసుల నుంచి వినిపిస్తున్నాయి.

అలాగే రూ. కోటి వెచ్చించి నిర్మించిన గ్లాస్ ఏసి బస్ షెల్టర్ కొంతకాలంగా ప్రయాణీకులకు ఏ మాత్రం ఉపయోగ పడడం లేదు. గత రెండేళ్లుగా కార్పొరేషన్ పాలక వర్గం లేకపోవడం వలన ప్రజా సమస్యలు చర్చకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. ముగ్గురు ప్రత్యేకాధికారులు మారినా నగర అభివృద్ధి ప్రణాళికలపై సమీక్షలు కూడా జరపడం లేదు. అఖిలపక్షం నిర్వహించి ప్రజల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించడం లేదు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలు కేవలం మొక్కుబడిగానే సాగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మారినా కార్పొరేషన్ అధికారుల తీరు మారలేదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలి

వివేకానంద పార్కు, జవహర్ వీధి, నూకాలమ్మ గుడి వీధి మార్గాల్లో పార్కు ప్లాట్ ఫారం ఆనుకుని వాహనాల పార్కింగ్ వెసులుబాటు కల్పించాలి. బాలం వారి వీధి, గోపాల కృష్ణ వీధి, పశువుల ఆసుపత్రి వీధుల్లో ఇళ్ల ముందు పార్కింగ్ నిషేధించాలి. సైకిల్ ట్రాక్ గొట్టాలు సిమెంటు పలకలు తొలగించి ప్రజా ప్రయోజనాల కోసం అవకాశం కల్పించాలి.

-దూసర్లపూడి రమణరాజు, సామాజిక వేత్త, కాకినాడ.

మసీద్ సెంటర్లో సామ్రాజ్యవాద వ్యతిరేక ఆందోళన నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

యుద్ధం వద్దు శాంతి కావాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ యుద్ధం వద్దు శాంతి కావాలని సిఐటియు నేతలు కోరారు. ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య పిలుపు మేరకు సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం సామ్రాజ్యవాద వ్యతిరేక ఆందోళన కార్యక్రమాన్ని స్థానిక మసీదు సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కె.సత్తిరాజు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి అమెరికా, నాటో దేశాల సామ్రాజ్యవాదం విఘాతం కలిగిస్తుందన్నారు. బిజెపి అధికారంలోకి రాగానే భారత అలీన విదేశాంగ విధానానికి తిలోదకాలు ఇచ్చి గాజా ప్రజలపై జరిగే యుద్ధంలో ఇజ్రాయెల్ సైన్యానికి ఆయుధాలు సరఫరా చేసి దేశప్రతిష్టను మంటగలు పుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల నేతలు చంద్రమళ్ళ పద్మ, మలకా రమణ, చివుకుల వెంకటరావు, టి.రాజా, వెంకట రమణ, ఏడుకొండలు, నాగరాజు, చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకురాలు చెక్కల అమృత, వేణి పాల్గొన్నారు. **పెద్దాపురం** సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచశాంతి వర్ధిల్లాలని ఆదివారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు,వడ్డి సత్యనారాయణ, రొంగల వీర్రాజు, చింతల సత్యనారాయణ, సావిత్రి, ఆదిరెడ్డి శ్రీను, కరణం అప్పారావు, నీలపాల కృష్ణ, దారపురెడ్డి కృష్ణ, డి సత్యనారాయణ, కూనిరెడ్డి అప్పన్న పాల్గొన్నారు. **పిఠాపురం** సిపిఎం, పార్టీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక నందూరి ప్రసాదరావు భవనం నుంచి చర్చి సెంటర్ వరకు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి మాట్లాడారు. ప్రపంచంలో 4 దేశాల్లో యుద్ధ వాతావరణం కమ్ముకుని ఉందన్నారు. అమెరికా ఆయుధ వ్యాపారం కోసం యుద్ధాలను ప్రోత్సహిస్తుందని దుయ్యబటారు. ఈ యుద్ధాల వల్ల ఎందరో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇజ్రాయిల్ దేశానికి అండగా నిలవడాన్ని ప్రజలు వ్యతిరేకించాని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుంచే చిన్న, కోనేటి రాజు, కరణం విశ్వనాథం, నాగేశ్వరరావు. వీరబాబు, నందీశ్వరరావు, మోహనాచార్యులు, పి.చంటి, సుర్యనారాయణ పాల్గొన్నారు. **కోటనందూరు** సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె.పద్మ ఆధ్వర్యంలో యుద్ధాలను వ్యతిరేకిస్తూ ప్రపంచశాంతికై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరికుమారి, నాగు రామలక్ష్మి, ముక్కుడుపల్లి బాబురావు, జిమీల్, అంజలి, చిన్న తల్లి, నాగలక్ష్మి మేరి, అమ్మోజి, రమణమ్మ పాల్గొన్నారు.

పిఠాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

పెద్దాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

పంపా నుంచి మిగులు జలాల విడుదల

ప్రజాశక్తి - శంఖవరం

గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అన్నవరం పంపా రిజర్వాయర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా రావడంతో పంపా నీటిమట్టం 98.4 అడుగులకు చేరుకుంది. గత మూడు రోజులుగా రిజర్వాయర్‌లోకి వస్తున్న నీటి ప్రవాహాన్ని ఆధారంగా చేసుకుని దిగువకు రోజుకు 500 నుంచి 1200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అయితే పంపా రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి వరద నీరు రోజుకు 1000 క్యూసెక్కులు రావడంతో నీటిమట్టం కనీస స్థాయి వరకూ ఉండేలా కెనాల్ గేటు ద్వారా 800 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు వదులుతున్నట్లు పంపా రిజర్వాయర్ ఇన్‌ఛార్జ్ డిప్యూటీ ఇంజనీర్ కాశి సురేష్ 'ప్రజాశక్తి'కి తెలిపారు.

కెనాల్ గేటు ద్వారా కాలువలోకి విడుదల అవుతున్న వరదనీరు

పాత పెన్షన్‌ను పునరుద్ధరించండి

ప్రజాశక్తి - కాకినాడ

2004 తర్వాత నియమితులైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సిపిఎస్ ఉద్యోగుల సంఘం ఎంఎల్ఎ వనమాడి కొండబాబును కోరింది. ఆదివారం సంఘం నాయకులు ఎంఎల్ఎను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యూటీలు కలిపించి ఉద్యోగులను ఆదుకున్నారని, అదేవిధంగా ఉద్యోగులకు రిటైర్మెంట్ పెన్షన్ కలిపించాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వం ఉద్యోగులను అన్ని రకాలుగా మోసం చేసిందని, వారంలో రద్దు చేస్తామని నాన్చుతూ చివరకు జిపిఎస్ అంటూ మరో మోసపూరిత పెన్షన్ విధానాన్ని ఉద్యోగుల మీద రుద్దడం జరిగిందన్నారు. ప్రశ్నించిన ఉద్యోగుల మీద కేసులు పెట్టి వేధించారని సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జిపిఎస్ విధానాన్ని ముఖ్య మంత్రి చంద్రబాబు గజిట్ నోటిఫికేషన్ రాకుండా నిలిపివేయడం ఉద్యోగులకు ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో పాత పెన్షన్ మీద, ఉద్యోగుల మీద పెట్టిన పోలీసు కేసుల మీద చర్చించి ఉద్యోగుల కు న్యాయం చేయాలని కోరారు. ఎంఎల్ఎను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్‌కెవి.బాషా, ప్రధాన కార్యదర్శి డి. వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులు నూకరాజు, రాష్ట్ర కార్యదర్శులు చింతా నారాయణమూర్తి, అలీమ్ ఉన్నారు.

ఎంఎల్ఎ కొండబాబుకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

శెట్టిబలిజలకు పూర్వ వైభవం : మంత్రి సుభాష్

ప్రజాశక్తి - తాళ్లరేవు

కూటమి ప్రభుత్వ పాలనలో శెట్టిబలిజ సామాజికవర్గానికి పూర్వ వైభవం రానుందని కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం శెట్టిబలిజ సామాజిక వర్గం ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజులతో కలిసి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కల్లుగీత కార్మిక సొసైటీలకు 20 శాతం మద్యం షాపులు కేటాయించేలా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం శెట్టిబలిజ సామాజిక వర్గ ప్రతినిధులతోపాటు మండలంలోని వివిధ తరగతుల ప్రజలు నాయకులను ఘనంగా సత్కరించారు. మండలంలో శెట్టిబలిజ సామాజిక వర్గ భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎంపిపి రాయుడు సునీత, నాయకులు గుత్తుల సాయి, టేకుమూడి లక్ష్మణరావు, కట్ట త్రిమూర్తులు, గంజా సూరిబాబు, పిల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కార సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎంఎల్‌సి హరిప్రసాద్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఏలేరు, సుద్దగడ్డ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రూ.1000 కోట్లతో ప్రణాళికను రూపొందించారని ఎంఎల్‌సి పి.హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం గొల్లప్రోలు జగనన్న కాలనీ మార్గంలో వరద నీటితో మునిగిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు సమస్యను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. గొల్లప్రోలు, చేబ్రోలుకు చెందిన ప్రజలు ఏలేరు, సుద్దగడ్డ ముంపుతో సతమతమౌతున్నట్లు గుర్తించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రూ.1000 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టును రూపకల్పన చేస్తున్నారని, త్వరలోనే ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజలకు హామీ ఇచ్చారు. ముంపు ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం పడవ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భోజనాలు, మంచి నీరు తదితర తక్షణ అవసరాలు తీర్చమని స్థానిక నాయకులు, అధికారులను ఆదేశించామన్నారు. వర్షం తగ్గిన వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసే పనిని చేపడతామన్నారు. అనంతరం గొల్లప్రోలులోని పవన్ కళ్యాణ్ నివాసంలో అందుబాటులో ఉన్న పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. అటవీ, పర్యావరణ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్నందున రాష్ట్రాన్ని పారిశుధ్యం, పచ్చదనం వెల్లివిరిసేలా పార్టీ నుంచి క్లీన్ ఆంధ్ర, గ్రీన్ ఆంధ్ర కార్యక్రమానికి పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఆ కార్యక్రమంలో కేవలం మొక్కలు నాటే ప్రక్రియ మాత్రమే ముందుకు వెళ్లే సూచనలు కనబడుతున్నాయన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు సహాయక కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని, మిగిలిన ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమంతోపాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం పవన్‌పై పాట విడుదల

ప్రజాశక్తి - సామర్లకోట

పవన్ కళ్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని పట్టణానికి చెందిన దేవగుప్తాపు వీరన్న రచించిన పాటను జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి ఆదివారం విడుదల చేశారు. పవన్ కళ్యాణ్ సేవా నిరతిని, రాజకీయ చతురతుని కొనియాడుతూ పాటను వీరన్న రచించారు. ఈ సందర్భంగా పాట ను రచించిన వీరన్న మాస్టర్‌ను, నిర్మాత సంధ్యారాణి, మ్యూజిక్ డైరెక్టర్ పాల్ నవీన్‌ను బాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాటను ప్రారంభిస్తున్న తుమ్మల రామస్వామి

కంటి సమస్యల పట్ల నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - కాజులూరు

కంటి సమస్యల పట్ల నిర్లక్ష్యం చేయరాదని వేమగిరి పరమహంస యోగానంద కంటి వైద్య నిపుణులు డాక్టర్ డి.చంటి బాబు అన్నారు. ఆదివారం స్థానిక వినాయక పాఠశాల ప్రాంగణంలో కీర్తిశేషులు, పాఠశాల కరస్పాండెంట్ తిరగాటి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పాఠశాల కరస్పాండెంట్ కిషోర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంటిబాబు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు కంటి సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తుంటారని అన్నారు. ఇటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినప్పుడు ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ శిబిరంలో 290 మంది కి మంది వైద్య పరీక్షలు నిర్వహించగా 38 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.రమ్య, పాఠశాల డైరెక్టర్ తిరగాటి విజయ్, వెలుగుబంట్ల శ్రీరామచంద్రమూర్తి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఆదిత్యలో ఓరియంటేషన్ తరగతులు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఫోరెన్సిక్ సైన్స్ విభాగం 2024-25 బ్యాచ్ విద్యార్థుల కోసం ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ఫోరెన్సిక్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విలాస్ అనిల్ చవాన్ ఓరియంటేషన్ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్ చవాన్ కళాశాల యొక్క వివిధ అంశాలపై విద్యార్థులకు ఆదిత్య విద్యాసంస్థల గురించి పరిచయం చేస్తూ ఫోరెన్సిక్ విభాగంలోని మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీలు మరియు సిబ్బంది గురించి, విద్యార్థుల నియామకాలు, సర్టిఫికేషన్ కార్యక్రమాలు, విద్యా సందర్శనలు మరియు విద్యా కార్యకలాపాలు ముఖ్యమైన అవకాశాలను వివరించారు. వైస్ ప్రిన్సిపల్ పివి.నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రమశిక్షణతోపాటు విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు.



ఓరియంటేషన్ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

ఫ్లెక్సీలపై జరిమానాలు విధించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఫ్రీ ఫ్లెక్స్ స్మార్ట్ సిటీ అమలులో ఇష్టారాజ్యంగా ఫ్లెక్స్ లు కట్టే కట్టించే బాధ్యులపై జరిమానాలు విధించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కలెక్టర్, కమిషనర్ ఆదేశాలను ఉల్లంఘిస్తూ ప్రధాన రహదారుల్లో విద్యుత్ స్తంభాలకు, విగ్రహాల కూడళ్ళకు వివిధ రకాల రాజకీయ, వ్యాపార, సంతాప ఫ్లెక్సీలు వెలుస్తూనే ఉన్నాయన్నారు. నగరంలో ఫ్రీ ఫ్లెక్స్ స్మార్ట్ సిటీ అమలులో ఉపాధి కోల్పోయిన ఫ్లెక్స్ వర్కర్లకు బ్యాంకుల ద్వారా ఉపాధి రుణాలు మంజూరు చేయాలని ఆయన కోరారు.

నేడు ఉచిత రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని హుస్సేన్ పురంలో నేడు ఉచిత రక్తదాన శిబిరం, స్కూల్ పిల్లలకు పుస్తకాల పంపిణీ, మొక్కల నాటే కార్యక్రమాలు చేపడుతున్నట్లు గ్రామ టిడిపి అధ్యక్షులు చల్లా బుజ్జి చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు పాల్గొంటారని తెలిపారు.

నేడు పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి - కాకినాడ

కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారం వేదిక(పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ షాన్ మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వల్ల జిల్లావ్యాప్తంగా అధిక వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. కలెక్టరేట్‌తోపాటు, డివిజన్, మండల స్థాయిలో జరిగే కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. కావున ఫిర్యాదుదారులు గమనించాలని సూచించారు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలు, కళాశాలకు సెలవు ప్రకటించినట్లు ఆయన తెలిపారు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలు, కళాశాలకు సెలవు ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

కార్టూన్ 'నిజం'



భవన నిర్మాణ సంఘం నూతన కమిటీ ఎన్నిక

నూతన కార్యకర్గంతో కార్మికులు

ప్రజాశక్తి - జగ్గంపేట

వినాయక రావులమ్మ భావన నిర్మాణ సంఘం నూతన కమిటీ ఆదివారం ఎన్నిక అయింది. స్థానిక చెరువు గట్టుపై జరిగిన సంఘ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షులుగా బోరా సత్తిబాబు, అధ్యక్షుడిగా కొల్లి సత్తిబాబు, ఉపాధ్యక్షుడుగా కింగం సురేష్, సెక్రటరీగా కెంగం దుర్గప్రసాద్, ట్రెజరరీగా కంది పెద్దకాపులను ఎన్నికయ్యారు. అనంతరం స్థానిక టిడిపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గౌరవ అధ్యక్షులు బోరా సత్తిబాబు మాట్లాడుతూ వినాయక రవులమ్మ తాపీ వర్కర్స్ సంక్షేమ సంఘంలో 500 మంది సభ్యులు ఉన్నారని అన్నారు. తమ సంఘ భవనం నిమిత్తం గతంలోనే ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ స్థలం ఇచ్చారని, ఆ స్థలంలో భవనం నిర్మించుకునేందుకు నిధులను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు.. కొన్ని దారి మళ్లింపు

రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌లైన్ డెస్క్‌ను సంప్రదిస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - సామర్లకోట

అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు వరదలు కారణంగా ఆదివారం సామర్లకోట జంక్షన్ మీదుగా వెళ్లాల్సిన గోదావరి, గౌతమి, లింక్ , గరీబ్ రథ్, ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆలస్యంగా నడవడం జరుగుతుందని సామర్లకోట స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు. అలాగే సామర్లకోట జంక్షన్ మీదుగా విజయవాడ వైపు వెళ్లాల్సిన గోదావరి, గౌతమి, లింక్, గరీబ్ రథ్, ఎల్‌టిటి తదితర రైళ్లను రద్దు చేసినట్లు ప్రయాణికులు గమనించాలని తెలిపారు. రైళ్ల ఆలస్యం, రైళ్ల రద్దు సమాచారం నిమిత్తం 08842327010 నెంబర్‌లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి సమాచారం ఇస్తారన్నారు. విజయవాడ వద్ద కొండపల్లి రైల్వే లైన్ వరద నీటి ముంపుకు గురికావడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. దారి మళ్లింపులో ఎపి ఎక్స్‌ప్రెస్, పాట్నా హంసాపూర్, యశ్వంతపూర్ టాటా నగర్ వీక్లీ, మచిలీపట్నం సూపర్ ఫాస్ట్, నర్సాపూర్ స్పెషల్, సింహపురి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లతోపాటు, తదితర 15 ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించి నడుపుతున్నట్లు చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అవగాహన ఉంటే వ్యాధులకు దూరంగా ఉండొచ్చని జిల్లా మలేరియా అధికారి(డిఎంఒ) భాస్కరరావు అన్నారు. వర్షాకాలం సీజన్లో ప్రధానంగా మలేరియా, డెంగీ వ్యాధులతోపాటు విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. వ్యాధుల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను ఆయన 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

వ్యాధులకు దూరంగా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.?

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గతేడాది ప్రతి ఇంటిలోనూ ఒకరికి వ్యాధులు సోకి ఆస్పత్రులలో చికిత్స పొందారు. ఈ ఏడాది కూడా వ్యాధుల ముప్పు పొంచి ఉన్న తరుణంలో ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇంటిలోని, చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఈ కాలంలో దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుంది. పరిసరాల్లో వర్షపు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి. పూలకుండీలు, వాటర్ ట్యాంకుల్లో నీటిని శుభ్రం చేయాలి. ఇంటి చుట్టు పక్కల పాత టైర్లు, తాగి పాడేసిన కొబ్బరి బోండాలు ఉండకుండా చూసుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు సాయంత్రం వేళల్లో వేపాకు పొగ వేయడం మంచిది.

డయేరియా రావడానికి కారణాలేంటి.. రాకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలి.?

కలుషిత నీటిని తాగడం, ఆహారాన్ని తినడంవల్ల డయేరియా ప్రబలే అవకాశం ఉంటుంది. వర్షాలకు ఇంటి పరిసరాలు చిత్తడిగా మారి ఈగలు పెరుగుతాయి. ఈగలు మనం తినే ఆహార పదార్థాలపై వాలి కలుషితం చేస్తాయి. దీంతో ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకకుండా పరిసరాల శుభ్రతను పాటించాలి. ఇంట్లోకి ఈగలు రాకుండా జాలీ (మెష్) వంటివి ఏర్పాటు చేసుకోవాలి. ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ ఆహార పదార్థాలు, ద్రవపదార్థాలు పడేయకూడదు. వేడి పదార్థాలను తీసుకోవడం మంచింది.

డెంగూ లక్షణాలు ఏమిటి..ఎలా వ్యాపిస్తుంది.గణాంకాలు తెలపండి.?

డెంగూను వ్యాపించే దోమ శుభ్రమైన నీటిలో పెరుగుతుంది. ఈ దోమ కుట్టిన పది రోజులకు వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే డెంగూగా పరిగణించాలి. వ్యాధిగ్రస్తులకు రక్తకణాలు (ప్లేట్లెట్స్) తగ్గి పరిస్థితి విషమించే ముప్పు ఉంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే

డెంగూ సోకకుండా చూసుకోవచ్చు. ఇంటి ఆవరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పరిసరాల్లో నీరు నిలిస్తే కిరోసిన్ చల్లాలి. జిల్లాలో 2016లో 336 కేసులు, 2017లో 170 కేసులు, 2018లో 545కేసులు, 2019లో అత్యధికంగా 575 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 24 వరకూ 3,145 మందికి పరీక్షలు చేయగా 116 కేసులు నమోదయ్యాయి. అప్రమత్తంగా లేకుంటే కేసుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

మలేరియా రాకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.. గణాంకాలు ఏమిటి.?

దోమల నివారణకు నిలువ ఉన్న నీటిలో లార్వా నివారణకు గంబుసియా చేపలను వదులుతున్నాం. ఈ చేపలు దోమల లార్వాను తినడం వలన వ్యాప్తి తగ్గుతుంది. సుమారు 2 లక్షల చేపలను జిల్లా వ్యాప్తంగా అన్ని మండలల్లోనూ వేసేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో మలేరియా కేసులు 2016లో 9061, 2017లో 5995 కేసులు, 2018లో 1865 కేసులు, 2019లో 646 మలేరియా కేసులు, ఈఏడాది జనవరి నుంచి ఆగస్టు 24 వరకు 5,549 మందికి పరీక్షలు చేయగా 5 కేసులు నమోదయ్యాయి. ఏజెన్సీ మండలాల్లోని ఇవి ఎక్కువగా నమోదవుతున్నాయి.

వైరస్‌ల ప్రభావంతో వచ్చే జ్వరాలు వాటి ప్రభావం ?

వర్షాలు కురుస్తున్నందున వైరస్ ప్రభావం ఎక్కువ ఉంటుంది. దగ్గు, జలుబుతో మొదలై జ్వరం వస్తుంది. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు ఎక్కువై ప్రమాదం భారిన పడే అవకాశం ఉంది. వృద్ధుల్లో శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. ఆయాసం పెరుగుతుంది. చిన్నపిల్లల్లో జ్వరం ఎక్కువగా వస్తే మూర్ఛపోయే అవకాశాలు ఉంటాయి. నిల్వ ఉన్న పదార్థలు తినకూడదు. ఇంటి ఆవరణంలో నీల్వకుండా జాగ్రత్తలు పాటించడం వల్ల వైరస్‌లు వ్యాపించవు. కలుషితమైన నీటిని తాగడం వల్ల కూడా శరీరంలోకి వైరస్ వ్యాపిస్తుంది. స్వచ్ఛమైన నీటిని తాగాలి.

సీజన్ వ్యాధుల నివారణ కోసం చేపడుతున్న చర్యలేమిటి.?

గ్రామీణ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడంతోపాటు కళా జాతాలు, పిహెచ్‌సి, సిహెచ్‌సిల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామీణ, పట్టణ.ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకుల్లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేయడం జరుగుతోంది. వైద్య సిబ్బందిని, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు, మరో వ్యక్తి గాయలపాలయ్యాడు. స్థానిక ఎస్ఐ టి.రఘునాథరావు తెలిపిన ప్రకారం...అనపర్తి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కోనాల సాయి మణికంఠ రెడ్డి(25), నల్లమిల్లి శివదుర్గారెడ్డి ఇరువురు బైక్‌పై విశాఖపట్నం వైపు వెళుతుండగా రామవరం పెట్రోల్ బంకు సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న బొల్లోరా వాహనం ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇరువురు పక్కనున్న కాలువలోకి పడిపోయారు. దీంతో సాయి మణికంఠ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా శివదుర్గారెడ్డి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే శివ దుర్గా రెడ్డిని ఆసుపత్రికి తరలించారు. వాహన డ్రైవర్ పరారీలో ఉండగా వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని అమనాబాద్ గ్రామానికి చెందిన యువకుడు చెరువులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..గ్రామానికి చెందిన కాకడ లోవరాజు (30) చెరువులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆదివారం ఉదయాన్నే బహిర్భూమికి వెళ్లి కాలు జారి చెరువులో పడిపోయినట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య, నాలుగేళ్ల పాప ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని కోలంక గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని కోలంక గ్రామానికి చెందిన యాళ్ల శ్రీనివాస్ మద్యానికి బానిసై తండ్రితో గొడవకు దిగేవాడు. కొడుకు ఆగడాలను తట్టుకోలేక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మనస్తాపానికి గురియైన శ్రీనివాస్ శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తులసిరామ్ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని స్టీల్ వేర్ పేటకు చెందిన యువతి తుమ్మలపల్లి మౌనిక(19) కనిపించడం లేదని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత నెల ఆగస్టు 31 నుంచి తమ కుమార్తె కనిపించడం లేదని, తాళ్లపొలం గ్రామానికి చెందిన కిషోర్ అనే యువకుని ప్రమేయం ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు అందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

కుమారుని అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

తన కుమారుడు కన్పించడం లేదంటూ ఓ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం...మండలంలోని రాజేంద్ర కాలనీకి చెందిన బొంతు మోహన్ శివసందీప్‌కు అతని భార్య త్రివేణికి మధ్య మనస్పర్ధలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత నెల 29న మోహన్ శివ సందీప్ ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు స్నేహితుల ఇళ్ళ వద్ద వెతికిన ఆచూకీ లభించక పోవడంతో శివసందీప్ తల్లి చంద్రావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ పట్ల వసతి గృహ అధికారులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె పట్టణ పరిధిలోని ఎస్‌సి బాలుర, బాలికల, బిసి బాలుర, బాలికల వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపాను, వర్షాల ప్రభావం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని అందించాలన్నారు. వసతి గృహాల్లో కల్పిస్తున్న సదుపాయాలు, భోజనాలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కాంతారావు, ఆయా వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ వెంకటలక్ష్మి

మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - పెద్దాపురం

భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలో వర్షాలు వల్ల సంభవించే సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ కెవి.పద్మావతి తెలిపారు. పట్టణ పరిధిలో ఏదైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 08852-242100 కు సమాచారం అందించాలన్నారు. దీనికి సంబంధించి సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

మొక్కను నాటుతున్న పర్వత సురేష్

చిన్నశంకర్లపూడిలో అరుదైన పక్షి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు మండలం చిన్న శంకర్ల పూడి గ్రామంలో అరుదైన పక్షి ప్రత్యక్షమైంది. బెంగాల్ అడవుల్లో మాత్రమే కనిపించే బెంగాల్ ఈగల్ ఓవెల్ అనే పక్షి చిన్న శంకర్ల పూడి గ్రామానికి చెందిన రైతు చను బోయిన బుజ్జి పొలంలో గాయాలతో పడివుంది. కోతిని పట్టుకు పోతుండగా మిగతా కోతులు దాడి చేయడంతో గాయపడింది. గాయాలతో ఉన్న పక్షిని రైతు ఈ పక్షిని ఇంటికి తీసుకువచ్చి కోళ్లను పెంచే గూడులో ఉంచి అటవి అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఈ పక్షి మేకలను, కొండ గొర్రెలను అమాంతం కాళ్లతో పట్టుకుపోయి ఆహారంగా తీసుకుంటుందని, దీనిని ఇండియన్ ఈగల్ ఓవెల్ అంటారని, ఈ పక్షి కేవలం బెంగాల్ అడవుల్లో మాత్రమే ఉంటుందని అధికారులు తెలిపారు. పక్షికి వైద్య చికిత్సలు అందించి అడవులోకి తీసుకెళ్లి వదిలేస్తామని అధికారులు తెలిపారు.

గాయాలతో రైతుకు లభించిన అరుదైన పక్షి

వర్షాలకు కూలిన పాత భవనం

ప్రజాశక్తి - పిఠాపురం

గత రెండు మూడు రోజులుగా కురుసున్న వర్షాలకు స్థానిక గోల్డ్ మార్కెట్ సెంటర్ లోని పాత భవనం కొంతమేర కూలిపోయింది. భవనం కూలిపోయే సమయానికి జన సంచారం పెద్దగా లేకపోవడం, చుట్టూ ప్రక్కల దుకాణాలు తెరవకపోవడతో ప్రమాదం తప్పింది. మున్సిపాలిటి పరిధిలో కాలం చెల్లిన భవనాలు పదులు సంఖ్యలో ఉన్నాయి. కాలం చెల్లిన భవనాలపై చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా చర్యలు తీసుకోవడం లేదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాలం చెల్లిన భవనాలను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కూలిపోయిన పాత భవనం శిధిలాలు

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - శంఖవరం

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని అవసరమైన పర్యావరణం పరిరక్షించుకోవచ్చని ప్రత్తిపాడు నియోజవర్గ టిడిపి సీనియర్ నాయకుడు పర్వత సురేష్ అన్నారు. ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించేందుకు దృష్టి సారించాలన్నారు. మొక్కలు చుట్టూ రక్షణగా ట్రీ గార్డ్సను మండల జనసేన నాయకుడు మేకల కృష్ణ సమకూర్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ఎల్ఐసి కార్యాలయ రోడ్డులోని ఉన్న శ్రీ సాయి భవాని హాస్పిటల్ ఆధ్వ ర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు. ఈ శిబిరాన్ని మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ ఎన్.వర్మ ప్రారంభించారు. వైద్యులు బి వెంకటేష్, టిఎస్ఎస్.దక్షిణమూర్తి సుమారు 500 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వివిఎస్.రామారావు, సూపర్‌వైజర్ ఎస్‌కె.రెహమాన్, ఫిజియోథెరపిస్ట్ కె.తరుణ్‌కుమార్, ఆడియాలజిస్ట్ కె.రవితేజ, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులతో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ వర్మ

చిన్నారి సత్యచరిష్య వరల్డ్ రికార్డు

ప్రజాశక్తి - సామర్లకోట

వారణాశిలో ఆదివారం నిర్వహించిన రావణాకృత శివతాండవం కూచిపూడి నృత్య కార్యక్రమంలో పట్టణానికి చెందిన కోడూరి సత్య చరిష్య వరల్డ్ రికార్డు హోల్డర్ మెడల్‌ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థిని సత్య చరిష్యకు తల్లి తండ్రులు కోడూరి సత్య శివ ప్రసాద్, రాణి లకు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ అభినందనలు తెలిపారు.

చిన్నారి సత్య చరిష్య

నేడు దివిలిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నేడు మండలంలోనిదివిలి ఎంపీ యూపీ పాఠశాల వాటర్ ట్యాంక్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎం.సత్యప్రసాద్, జిఎస్‌వి.రావు, కెఎస్ఆర్‌కె,చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ రక్తదాన శిబిరంలో జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి పాల్గొంటారని తెలిపారు.

మట్టి విగ్రహాలతోనే చవితి వేడుకలు

ప్రజాశక్తి - కాకినాడ

మట్టి వినాయక విగ్రహాలు ఉపయో గించి పర్యావరణహితంగా వినాయక చవితని నిర్వహించుకోవాలని జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీని వాస్ వినీల్ పిలుపునిచ్చారు. ఆదివారం మట్టి గణపతి ప్రతిమలు తయారు చేసే పోటీని ఎంఎస్ ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులు చక్కటి ప్రతిభను కనబరిచారు. 18 పాఠశాలలు, కళాశాలల నుంచి 46 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలు ఉపయోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. హెచ్ఎం ఎంఎస్.సుబ్రమణ్యం మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ జి.సాయినంద కుమర్, ఎపి నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వివిఎస్‌వి.రమణమూర్తి, సిహెచ్ఆర్ విజి.ప్రసాద్, జి.శ్రీనివాస్, శ్రీహరిరావునాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంఎల్ఎ హరికృష్ణ జయంతి

ప్రజాశక్తి - యానాం

యానాం మాజీ ఎంఎల్ఎ రక్షా హరికృష్ణ 84వ జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫెర్రిరోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి యానాం పరిపాలనాధికారి మునిస్వామి, మత్స్యశాఖ అధికారి డి.గొంతియ్య, ఎస్‌పి రాజశేఖరన్, సీఐ షణ్ముఖం, ఎస్ఐ నూకరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని వారు కొనియాడారు. అలాగే ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లాడి సామ్యూల్ స్థానిక మెట్టకూరు ఫిషర్‌మెన్ పేటలో రక్షా హరికృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మల్లాడి అభిమానులు పాల్గొన్నారు.

దార్శనికుడు సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-ముమ్మడివరం

దార్శనికుడు, విజనరీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం రాష్ట్రానికి శుభ సూచకం అని నియోజకవర్గ పార్టీ నేతలు కొనియాడారు. మండలంలోని సిహెచ్ గున్నేపల్లిలోని సీనియర్ నాయకుడు గొలకోటి దొరబాబు ఇంటి వద్ద చంద్రబాబు ముఖ్యమంత్రిగా 30 ఏళ్ల క్రితం ప్రమాణ స్వీకారం చేసిన రోజును ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. 1995 సెప్టెంబర్ 1 న తొలిసారి ముఖ్యమంత్రి గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కి బాధ్యతలు చేపట్టి నేటికి 29 ఏళ్లు పూర్తి చేసుకుని 30వ యేట అడుగిడిన సందర్భంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దార్శనికుడు ముందుచూపు గల వ్యక్తి విజినరీ లీడర్ చంద్రబాబు అని పలువురు కొనియాడారు.

3న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండల ంలోని ఈ నెల 3న అంగర అసిరాంబ అమ్మవారి ఆలయం వద్ద వాసవి క్లబ్ ఆధ్వర్యంలో లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరానికి ప్రొగ్రాం ఇంచార్జ్ ఎస్.కరుణకుమార్ ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.ప్రవీణ్ కుమార్ తదితరులు నిర్వాహకులు తెలిపారు.

పవన్‌కు గణిత చదరంతో శుభాకాంక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట

డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా మ్యాజిక్ చదరాల ద్వారా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రముఖ గణిత అవధాని తోటకూర సాయి రామకృష్ణ రూపొందించారు. ఈ చదరంలో మొదటి వరుసలో పుట్టిన రోజు తీసుకోబడింది. నాలుగు చదరాల్లో సంఖ్యల మొత్తం 55 వచ్చింది. దీన్ని మ్యాజిక్ సమ్ అంటారన్నారు. ఇపుడు చదరం ప్రత్యేకత ఏమిటంటే.వాడిన అంకె మరల వాడకుండా, ఏటు కూడిన 55 రావడం విశేషం. నాలుగు అడ్డ వరుసల్లో సంఖ్యల మొత్తం 55. నాలుగు నిలువు వరుసల్లో సంఖ్యల మొత్తం 55 రెండు కర్ణాలలో సంఖ్యల మొత్తం 55. నాలుగు మూలల సంఖ్యల మొత్తం 55. వరుసగా ఉన్న చిన్ని చదరాల్లో నాలుగు సంఖ్యల మొత్తం 55. ఇలా అనేక రకాలుగా 25కి పైగా ఒకే మొత్తం 55 వచ్చేలా రూపొందించారు. ఈ మ్యాజిక్ గణిత చదరం ద్వారా శుభాకాంక్షలు అందచేసి సాయి రామకృష్ణ ప్రత్యేకత చాటుకున్నారు.

2	9	20	24
25	19	6	5
7	4	26	18
21	23	3	8

In the Court of the Principal Junior Civil Judge, Kakinada
O.S. No. 1/2021

Between:
Canara Bank (Erstwhile Syndicate Bank), Madhura Nagar Branch, Kakinada.
...Plaintiff
AND
1. Smt. Lanka Sri Latha
2. V.Nageswara Rao
...Defendants

To:
1. Smt. Lanka Sri Latha, W/o. L.Venkateswara Rao, Proprietor of M/s. Sree Agnecies, aged 39 years, Business, D.No. 68-4-4, Kulai Veedhi, Opposite to Veer Kamal Theatre, Kakinada
2. V.Nageswara Rao, S/o. V.Venkata Ramana, aged 58 years, Business, D.No. 8-5-11, Venkata Narayana Street, Gandhi Nagar, Kakinada

పై నెంబరు దావాలో 1 మరియు 2వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనకుండగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీకోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 06-09-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

P.RAMAKANTH, Advocate
Kakinada, Cell: 9849215992

పోలీస్ పహరా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం పిల్లంక, గోవలంక ఏటిగట్టుపై రాత్రి సమయాల్లో పోలీసు పహారా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాలకు చెందిన పలువురు మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కోరారు. శనివారం రాత్రి కొందరు యానం ప్రాంతానికి చెందిన గంజాయి బ్యాచ్ యువకులు గ్రామానికి చెందిన వ్యక్తులపైన, ప్రయాణికులపైన దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఇదే రహదారిపై పాఠశాలలు, కళాశాల నుంచి బాలికలు వస్తూ ఉంటారని, గంజాయి బ్యాచ్ వల్ల పలువురు తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. రాత్రి సమయాల్లో ఏటిగట్టుపై గంజాయి, మద్యం సేవిస్తూ ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ఏటిగట్టుపై పోలీసుల పహారా ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు వేలూరి కాశిబాబు, జిత్తుగ శ్రీనివాస్ కోరారు.

శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - గండేపల్లి

ఇంజనీరింగ్ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆదిత్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఎంబి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, హైదరాబాదుకు చెందిన ఆర్‌టెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల మెగా బూట్ క్యాంపులో ఆయన మాట్లాడారు. పాఠ్యాంశాల్లోనూ, శిక్షణలోను నేర్చుకున్న అంశాలు ఉన్నత ఉద్యోగ సాధనకు ఉపయోగపడాలని ఆయన అన్నారు. భవిష్యత్‌లో వృత్తి నైపుణ్యాన్ని పెంపుదల చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖాధిపతులు డాక్టర్ ఆర్‌వివి.కృష్ణ, ప్రొఫెసర్. సిహెచ్.జానకిదేవి, ఆర్‌టెక్ ప్రోగ్రాం మేనేజర్ ఎం.చరణ్‌దత్, ఆదిత్య విద్యాసంస్థల ఆర్టెక్ కోఆర్డినేటర్లు ఎస్.దుర్గాప్రసాద్, పి.భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ముంపు సమస్యతో అవస్థలు

- ఎక్కడికక్కడే నిలిచిపోతున్న వర్షం, మురుగునీరు
- రాజోలు వాసులకు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు నియోజకవర్గ ముఖ్య కేంద్ర వాసులకు ముంపు సమస్య తప్పడం లేదు. . ప్రధాన రహదారితోపాటు పలు కాలనీల్లో మురుగు నిలిచిపోవడంతో నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కొన్నేళ్ల కిందట నియోజకవర్గ కేంద్రంలో భూగర్భకాలువల నిర్మాణానికి గాను ఇంజినీంగ్ అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. భూగర్భ డ్రెయిన్ వ్యవస్థ వల్ల ప్రధాన రహదారిలో రాకపోకలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు, వర్షం, మురుగు నీటిని కూడా పంపించేందుకు అప్పట్లో ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీనిపై గత సర్కారు కూడా దృష్టి సారించలేదు. మరోవైపు రాజోలులో కాలువలపై ఆక్రమణలు పెరిగిపోగా, తూతూ మంత్రంగా పూడికతీత పనులు చేపట్టడంతో ఏటా వర్షాకాలం రాజోలు వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కొద్దిపాటి వర్షానికి సైతం రాజోలు గాంధీ సెంటర్ నుండి సాయిబాబా గుడి వరకు మోకాళ్లలోతు వరకు వర్షం నీరు నిలుస్తోంది. మురుగునీరు కూడా ప్రధాన రహదారిపైకి చేరడంతో నివాసితులు, వ్యాపారులు బయటకు అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారిలోనూ ఎక్కడికక్కడే వర్షపు, మురుగునీరు నిలిచిపోవడంతో వాహనదారులు , పాదచారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. ఏటా వర్షాకాలంలో ఎదుర్కొంటున్న ఈ సమస్య నుంచి గట్టెక్కించాలని , ముంపు బాధను తప్పించాలని ప్రజలు నూతన ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు కూడా స్పందించి భూగర్భ కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వర్షం నీరు దిగక చెరువులా రాజోలు ప్రధాన రహదారి

వర్షం నీటికి ముంపులో రాజోలు బ్యాంక్ స్ట్రీట్

భారీ వర్షంతో రహదారుల జలమయం

ప్రజాశక్తి - రౌతులపూడి

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న సాగునీటి చెరువులు నిండుకున్నాయి. పలు గ్రామాల్లో డ్రెయినేజీలు, రోడ్లు తేడా లేకుండా పొంగిపొర్లాయి. డ్రెయినేజీలలో చెత్తా చెదారం ఒక చోటకు చేరి అపారిశుధ్యం తాండవిస్తుంది.

బాల మందిరంలో బాలల సభ

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని మాధవ పట్నం జమున నగర్ కాలనీలో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ బాల మందిరం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బాలలసభ జరిగింది. కథలు చదవడం, కథల సమీక్షలు, కథలు చెప్పడం కార్యక్రమాలు నిర్వహించారు. క్యారమ్స్, చెస్, వైకుంఠ పాళీ వంటి ఇన్ డోర్ గేమ్స్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పద్యాలు, పాటలు పాడారు. స్వీయరచనలో పిల్లలు ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమానికి బాల మందిరం కన్వీనర్ అంగర గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు.

మాజీ ఎంఎల్ఎ కుడుపూడికి ఘన నివాళి

ప్రజాశక్తి-అమలాపురం

మాజీ ఎంఎల్ఎ, వైసిపి నాయకుడు దివంగత నేత కుడుపూడి చిట్టిబ్బాయి జయంతిని పార్టీ ఉశ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆదివారం అమలాపురం గడియస్తంభం సెంటర్ లో ఉన్న ఆయన విగ్రహానికి రాష్ట్ర మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి సత్యానాగేంద్రమణి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు సంసాని బుల్లి నాని, చిట్టిబ్బాయి తనయుడు కుడుపూడి భరత భూషణ్, జెడ్‌పిటిసి సభ్యులు పందిరి శ్రీహరి, గన్నవరపు శ్రీనివాసరావు,కుడిపూడి సత్య శైలజ తదితరులు పాల్గొన్నారు.



కుడిపూడివిగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE :: PITHAPURAM
1.A.373/2023 O.S.159/2023

Between
Sundara Satyanandam .. Petitioner/Plaintiff
AND
Nimmala Babji .. Respondent/Defendant

టు ప్రతివాది:
నిమ్మల బాబ్జీ, S/o.మంగరాజు, వయస్సు 46 సం.రం.లు, డోర్.నెం. 1-68, 1-71, కోలంక, పిఠాపురం మండలం

పై దావా మరియు పిటిషన్ లో వాది మీ మీద దాఖలు చేసుకున్న దావా మరియు పిటిషన్ లో మీకు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసు పంపించినప్పటికీ మీరు ఉద్దేశ్య పూర్వకంగా తీసుకోకుండా కాలయాపన చేయు చున్నందున శ్రీ కోర్టు వారి ఆదేశం ప్రకారం మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబర్ గల దావా మరియు పిటిషన్ **ది.03.09.2024న** వాయిదా అయివున్నది.

కావున ఆ రోజు **ఉదయం 10:30 గం. నిలకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారాగాని హాజరు అయ్యి పై పిటిషన్ మరియు దావాలో మీ ఆక్షేపణలు తెలియ జేయవలెను. లేనియెడల పై దావా మరియు పిటిషన్ మీకు పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయబడినది.

(యిది శ్రీ కోర్టువారి ఆర్డర్ ప్రకారం జారీ చేయబడిన నోటీసు)

సాకా నాగేశ్వరరావు
న్యాయవాది, పిఠాపురం
ఫోన్: 9866094454